# 15

# విధ్వంసానికి ఆవలివైపు

*ఆ కిష్టారెడ్డి పిలుస్తుండాడంటే నిద్రలో కూడా వొణుకుతూ పరిగెత్తేది గదా నువ్వు... ఆ పేరు వింటేనే చాలు మనోళ్ళంతా వొంగి వొంగి దణ్ణాలు పెట్టేది... అబ్బొ చిన్న బాధలా అయ్యో...*

ఈ దృశ్యాన్ని, అవును సరిగ్గా యిలాంటి దృశ్యాన్నే ఇదివరకే ఎప్పుడో చూసిన జ్ఞాపకం...

ఇదంతా యిదివరకే ఎప్పుడో ఒకసారి జరిగిపోయినట్లుగా... తవ్విన గుంటని హడా విడిగా పూడ్చివెట్టి ఆ యింటి వైపుగా పరిగెడు తున్నారెవరో. అప్పుడది మిట్టమధ్యాహ్నాం... ఇప్పుడిది నడిరాత్రి.

కరెంటు పోయి చప్పున మెలకువ వచ్చినపుడు మెడ కింద మాత్రమే పట్టిన చెమటలు ఇప్పుడు ఒళ్ళంతా బుగబుగ మంటూ విస్తరిస్తున్నాయి. కిటికీలో నుండి వీచే నవంబరు మాసపు చల్లగాలి కూడా వేడి గానే తాకుతోంది శరీరాన్ని.

మనసూ, శరీరమూ... అందులో తలా, కాళ్ళూ, చేతులు అన్నీ వేటికవి విడిపోతున్నట్టు గా వుంది. నా చిన్నప్పుడు సున్నాన్ని విరబోస్తు న్నప్పుడు చూసి కలిగిన ఒకలాంటి జలద రింపే ఇప్పుడూ ఆవరించింది. దూరంగా కాంపౌండ్‌లోని మామిడిచెట్టు కింద మైనపొత్తి

చిరుకాంతిలో కదులుతోన్న రెండు ఆకారాలు యింతై, అంతై పదింతలై నా మీది నుండి కదులుతున్నాయి.

ధన్... ధన్... ధనాధన్... న్... న్... న్న్న్నంటూ వున్న గునపం శబ్దం గుయ్యి మంటూ వలయాలు వలయాలుగా నా చెవుల్నీ, గుండెల్నీ కూడా గింగిర్లెత్తిస్తూ...

అసలేం జరుగుతూందీ యింట్లో...

ఒకే చెట్టులో నుండి మొదలైన రెండు కొమ్మలు దక్షిణం వైపొకటి, ఉత్తరం వైపొకటి విస్తరించి రెండు రాజ్యాలై మూలాల్ని మరచి యుద్ధజెండా లెగురవేస్తున్నాయి.

నువ్వా? నేనా?

నేనా? నువ్వా? ఎక్కడ చూసినా యిదే.

నేను నువ్వు , నువ్వు నేనూ అన్న ఆలోచనే లేదు .

ఇక్కడ జరుగుతోన్న సంఘటనకి విలపిస్తున్నదానిలా ఆకాశం కురవడం మొదలుపెట్టింది. బొట్లుబొట్లుగా మొదలైన కన్నీరు భోరుమనకముందే గునపపు తవ్వకం లోలోపలి నుండి ఏదో వస్తువు బయటికి తీశాడు వెంకట్రాముడు. దాన్ని మా ఆయన రఘుపతీ, వెంకట్రాముడూ యిద్దరూ మార్చిమార్చి చూస్తూ ఏదో చెప్పుకుంటున్నారు .

ఈలోపుగా గుక్కపట్టినట్లుగా ఆకాశం హోరుమని ఏడవసాగింది. వెంకట్రా ముడూ, రఘుపతీ యిద్దరూ యింటివైపు నడవసాగారు. వాళ్ళిద్దరూ కొంత ముందుకి వచ్చాక అప్పుడు గమనించాన్నేను వీళ్ళిద్దరూ కాక మూడో వ్యక్తి వారితో వున్నట్లు.

కాషాయరంగు పొడవాటి చొక్కా, అదే రంగు పంచె, మెడలో లావుపాటి రుద్రాక్షమాల, నుదుటిన దోసగింజ ఆకారంలో దిద్దిన పెద్ద కుంకుమబొట్టు... అతడే రంగస్వామి. ఈ చుట్టుపక్కలున్న గ్రామాలన్నింటిలో చేతబడులూ, బాణామతులూ చేసిపెట్టడాలూ వంటి వాటికి గురువు. చేతబడులు చేయిస్తాడో, లేక చేసిన వాటిని తిప్పికొడతాడో అతడికే తెలియాలి. మొత్తానికి వాటితో సంబంధమున్న వ్యక్తి అని మాత్రమే నాకు తెలుసు.

ముగ్గురూ మాట్లాడుకుంటూ గబగబా వర్షంలో గేటువైపు నడుస్తున్నారు. వెంకట్రాముడ్ని తోడిచ్చి రంగస్వామిని సాగనంపి రఘుపతి లోపలికొచ్చాడు.

గుట్టుచప్పుడు కాకుండా వెళ్ళి పడుకుందామనుకుని కూడ దొంగని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవాలన్నట్లు కాచుక్కూచున్నాన్నేను.

"ఓహో మెలకువగానే వుండావా?... మరీ మంచిది... నువ్వు నిద్రపోతుణ్ణాగూడ లేపి చూపించాలనుకున్నాన్లే..." వ్యంగ్యంగా అంటూ చేతిలోని వస్తువుని విసురుగా నా ముందున్న టీపాయి మీదికి గిరాటేశాడాయన.

విస్తుపోయి చూస్తున్నాన్నేను. నిజానికి ఆయన లోపలికొచ్చాక యిదంతా ఏమిటని దబాయించి ప్రశ్నించడానికి సిద్ధపడి కూచుని వున్నానేమో... ఈ రివర్స్‌గేర్‌కి

షాక్‌తో నిగుడుకుపోయాను. టీపాయి మీద పడిన ఆ వస్తువుని చూసి నోటమాట రాలేదు నాకు.

అదొక చిన్న రబ్బరుబొమ్మ... రోజ్ కలర్లో వుంది. దాని తల బలవంతంగా వెనక్కి తిప్పబడి వుంది. కుడికాలి నిండా గుండుసూదులు గుచ్చివున్నాయి. కళ్ళల్లో రెండి చిన్న నల్లటి బటన్లు అమర్చి వున్నాయి. దాన్నలా చూస్తుంటే ఒక్కసారిగా ఒళ్ళు జలదరించింది. భయంతోనో భయంలాంటి మరో భావనతోనో నా గుండె దడదడా కొట్టుకుంటోంది.

అప్పటికి తల తుడుచుకుంటూ నా ఎదురుగా వున్న ప్లాస్టిక్ కుర్చీలో కూర్చున్నాడాయన.

"ఏవిటండీ యిదంతా?" అని అడుగుదామని నోరు తెరిచి గొంతెక్కడో అడ్డం పడ్డట్టయి వూరుకున్నాను.

అయితే నేనడగనంత మాత్రాన ఆయన రంకెలేయడం ఆపలేదు. "ఈ రోజుల్లో ఏమిటండీ చేతబడులూ, బాణామతులూనూ... మీకేమయినా పిచ్చెక్కిందా? అంటూ చిలకపలుకులు పలికి నా నోరు మూయిస్తివి గదే. ఇప్పుడు చూడు యిప్పటికయినా నమ్ముతావా...?"

నమ్మకపోతే నన్ను పిండి ఆరేసేలా వున్నాడాయన.

ఇప్పటిదాకా తెరుచుకునే వుండిపోయిన నా నోరు మూసి గుటక మింగాను.

"పొలంకాడ నిమ్మకాయలు, కుంకుమ, పూలు పడి వుంటే ఆరోజు అంటినిగదే ఈసారి కూడా మనకు పంట పండదు అని... పండదు. మనం ఏది మొదలుపెట్టినా గూడా పెట్టుబడితో సహా తుడిచిపెట్టుకొని పోతాది. మనం పైకి ఎక్కి రాగూడదు. తొక్కేయాల... అట్నే అణిగిపోవాల మనం భూమిలోకి. మళ్ళీ వీడొక తమ్ముడు... తోడ బుట్టినవాడు చెయ్యాల్సిన పనేనా యిది? బోసుబాబు, బోసుబాబు అంటా సిగ్గు లేకుండా వాడ్ని సమర్థిస్తావుగదే?" నా పైపైకి దూకుతూ, నా బుగ్గల మీద పొడుస్తూ ఏం మాట్లాడుతున్నాడో కూడా తెలియనంతగా ఒళ్ళు మరిచి వున్నాడాయన. ఇన్నేళ్ళ దాంపత్య జీవితములో నన్ను అది ఇది అని మాట్లాడ్డం నేనెప్పుడూ వినలేదు.

బహుశా తనకి కలిగిన ఆవేశమంతా యిలా బయటికి రావడమే మంచిదని మౌనంగా చూస్తున్నాన్నేను.

'ఎర్ర నిమ్మకాయలు, పూలు పొలంలో వేసినంత మాత్రాన పంట ఎండిపోతుందా? రబ్బరుబొమ్మని భూమిలో పూడ్చిపెట్టినంతలో యిల్లు సర్వనాశనమైపోతుందా?' అని అడుగుదామనుకుని నా చెంప పగుల్తుందని గ్రహించి మౌనందాల్చాను.

"అవును బుజ్జమ్మా... యిది నిండా భయంకరమైంది. దీని పేరు కుట్టిచాతానే..." అప్పడే రంగస్వామిని సాగనంపి వచ్చి మెట్ల కిందున్న చాపనందుకుంటూ, మా ఆయనతో పాటు మాటా అందుకున్నాడు వెంకట్రాముడు.

'కుట్టి చాతాన్'.అన్న పేరు విని నివ్వెరపోయి వెంకట్రాముడి కేసి చూస్తున్నాన్నేను. వెంకట్రాముడు మా మావగారి హయాం నుండీ ఈ యింట్లోనే వున్నాడు.

నేనూ, మంజూ కోడళ్ళమై ఈ యింటికొచ్చిన నాటి నుండీ బుజ్జమ్మా, చిన్నమ్మా అనే పిలుస్తాడు.

వెంకట్రాముడి కొడుకు జయరాముడు, బోసుబాబు యింట్లో పని చేస్తుంటాడు. ఇప్పుడు యజమానుల కొచ్చిన గొడవల మూలంగా తండ్రీకొడుకులిద్దరూ కూడా ఎడముఖం, పెడముఖంగా వుంటారని అంతా చెప్పుకుంటారు. ఈ గొడవలేమిటో, అసలెప్పుడు, ఎందుకు, ఎలా మొదలయ్యాయో అర్థం కాకుండా వుంది. ఒకరేమో అన్న, మరొకరు తమ్ముడు.

వెంకట్రాముడు నా చూపుని గ్రహించినవాడిలా మౌనంగా చాపనందుకుని వరండాలో కెళ్ళబోయి, మళ్ళీ ఏదో గుర్తొచ్చినట్లుగా ఆగాడు.

"బుజ్జమ్మా నీ బొట్టు చానా గట్టిదమ్మా. లేకుంటే ఈవరకు ఎట్టాటి గోరం జరిగిపోయుణ్ణో... మన అదృష్టం మంచిదనుకో. సమయానికి ఆ రంగస్వామిని గాన తోడుకు రాకపోతే కుట్టిచాతాన్ లోపలుండాదని మనకెట్టా తెలుస్తాది. అట్ట చూడమ్మా కుడికాలికి ఎన్ని గుండుసూదులు గుచ్చుండారో... అందుగ్గదా అబ్బయ్యకి కుడికాలే యిరిగింది... లేదంటే ఎందుకిరగతాది చెప్పు. ఎన్నిసార్లు మోటారుబండి మీద పోవడం లేదు, రావడంలేదు. నేనెన్నోసార్లుయెనకెక్కి కయ్యికాడికి పొయ్యుంటానుగదా... ఎప్పుడయినా యిట్ట జరిగుండాదా?" నిలదీసినట్లుగా ప్రశ్నించాడు వెంకట్రాముడు.

మూడు నెలల క్రితం ఫ్రాక్చరయిన తన కుడికాలిని చేత్తో నిమురుకుంటూ నాకేసి గుర్రుగా చూస్తున్నాడాయన. అంతరాంతరాలలో గాయాల్ని మిగుల్చుకున్న దేహం గుడ్లురిమి నిప్పులు కురిపిస్తున్నట్లుగా వుందతడ్ని చూస్తుంటే.

కిటికీలో నుండి విసురుగా వీచిన గాలి ఆయన చూపుల్ని పక్కకి లాగబట్టి సరిపోయిందిగానీ లేదంటే నేను తప్పక భస్మమై పోయుండేదాన్ని.

ఒకసారి మెల్లిగా దక్షిణంవైపు కిటికీలో నుండి ఆ యింటికేసి చూశాను... ఎన్నో మనసుల్ని ఛిద్రం చేసి మౌనంగా నిద్రిస్తోన్న మృత్యుగహ్వరంలా వుందా యిల్లు... చీకట్లో.

✦ ✦ ✦

"ఒక్క ఆడబిడ్డే చాలనుకుని నా నెత్తిన నేనే నీళ్ళు చల్లుకున్నాను. అంతా వీడి గురించే కదా... ఇప్పుడా పిల్ల పెళ్ళి కూడా చేయకుండా నాశనమైపోవాలని వీడు చూస్తుండాడు... లేకుంటే ఒకటా, రెండా నాలుగేళ్ళ నుంచీ పండిన పంట యింటికి రాకుండా నాశనమైపోతాదా? అంతకు ముందంతా ఈ నేలలోనే కదా పండించుకున్నాం... ఇట్టగానయితే నేను యిరవైయేళ్ళ నుండీ కాపురం ఎట్ట చేసుందును?..."

....నేను ఏ పని చేస్తోన్నా రాత్రి ఆయనన్న మాటలే పదేపదే గుర్తొచ్చి నన్ను కలవర పెడుతున్నాయి. ఉన్నట్టుండి నన్ను ఒకలాటి మైకమావరించింది. మెల్లిగా కుర్చీలో వెనక్కి వాలాను.

నిజంగా చేతబడులూ... బాణామతులూ వున్నాయా? కుడికాలుకే ఎందుకు ప్రాక్చరవాలి? ఆ రంగస్వామి చెప్పిందంతా నిజమేనా? కుట్టిచాతాన్ భయంకరమైన క్షుద్రదేవతా? ఇలాంటివే ఈ యింటి ఆవరణలో యింకా ఏమయినా పూడ్చిపెట్టబడి వున్నాయా? నా సంసారం ఏమయిపోబోతోంది? ఈ యింట్లోని మనుషుల మనసుల్ని యే విషపు చీమ కుట్టింది?

ఈ దక్షిణపు కిటికీలో నుండి చూస్తే ఆ యింటి పెరటి వైపు స్పష్టంగా కన్పిస్తోంది. వెనక వరండాకి అల్లుకుని ఒత్తుగా ఎదిగి వున్న రాధాకృష్ణ తీగ సీజన్ కాబోలు విరగబూసి వుంది.

ఆ తీగని తనే అక్కడ నాటింది. అది ఎదిగి పూలు పూసే నాటికి ఆయింటితోనూ, ఆ మనుషులతోనూ ఋణం తీరిపోతుందని కలలో కూడా వూహించలేదు.

ఒక్క యిల్లేంటి? తీగేంటి? మంజు కొడుకుని మాత్రం తను వేరేగా అనుకుందా? సొంత కొడుకన్నట్లుగానే కదా పెంచింది. ఎంతోమంది చూసినవాళ్ళు

'మీ చెల్లెలి కొడుకా? నీ కొడుకనుకున్నామే' అనేవాళ్ళు. ఆస్తి తగ్గిపోతుందని యిద్దరన్నదమ్ములకీ కలిపి వాడొక్కడే చాలనుకునే కదా స్నిగ్ధ పుట్టిన వెంటనే ఆపరేషను చేయించేసుకుంది తను.

ఇద్దరన్నదమ్ములకి ఒకే యింట్లో నుండి ఇద్దరక్క చెల్లెళ్ళని కోడళ్ళుగా తెచ్చు కుంటే ఆ యిల్లు విడిపోకుండా వుంటుందని కదా పెద్దవాళ్ళు పెళ్ళిళ్ళు చేస్తారు. మరిదేమిటీ యిలా జరిగింది.

అన్నదమ్ములయినా, అక్కచెల్లెళ్ళయినా సరే మోనిటరీ కనెక్షన్స్ వుంటే వాళ్ళు రాక్షసులుగా మారిపోతారని ప్రతిసారీ రుజువవుతూనే వుంటుంది .

"ఎవరు యింట్లో?" బయటి నుండి విన్పించిన గావుకేకకి ఉలిక్కిపడి వీధిగేటు వంక చూశాను.

ఎవరో కుర్రాడు... బ్లూజీన్స్ ఫ్యాంటులోకి గోధుమ కలరు డెనిమ్ షర్టు టకప్ చేసి అచ్చు సినిమా హీరోలా వున్నాడు. నేను కాళ్ళు కదుల్చుకుని బయటికెళ్ళేసరికి వరండాలో వున్న కుర్చీలు, టీపాయి ఎడాపెడా బూటుకాలితో నెట్టిపారేసి శివతాండవం చేస్తోన్న శివుడ్ని జ్ఞప్తికి తెస్తున్నాడు. వాడితో వచ్చిన మరో నలుగురు కుర్రాళ్ళు వాడు చేస్తోన్న విధ్వంసానికి సాయపడ్తున్నారు.

నేను విస్మయంతోనూ, ఒకింత భయంతోనూ వెనక్కి జంకాను.

"ఎక్కడ మీ ఆయన?" వాడి గొంతు విని అప్పుడు చూశాను, ముఖం వంక పరీక్షగా... "వరుణ్."

అరె వరుణ్ యింత పెద్దవాడయిపోయాడా? చూసి మూడేళ్ళయిపోయింది. ఆనందంలో నా హృదయం కదిలింది.

"వరుణ్ ఎప్పుడొచ్చావు?" అంటూ మెల్లిగా ముందుకడుగేశాను సంతోషంతో.

"ప్చ్..." అంటూ అరచేతిని అడ్డుపెట్టాడు ఏదో సినిమాలో హీరో స్టయిల్లో. ఆగిపోయిన సూర్యకాంతిలా విస్తుపోయి చూస్తున్నాన్నేను.

"ఈ బంధుత్వాలూ, ప్రేమలూ, నటనలూ యింకొద్దు... మేము చేయని పనిని మేమే చేసినట్లుగా వూరంతా చెప్తున్నాడట మీ ఆయన... ఇంక మమ్మల్ని గురించి ఒక్క మాట బయటంటే మర్యాద దక్కదని చెప్పు. చేతబడులు చేసి మనుషుల ప్రాణాలు తీయడమేనా మీ ఆయన పని... తెలీకుండా మాట్లాడొద్దని చెప్పు మీ ఆయన్తో," తర్జని చూపించి బెదిరిస్తున్నాడు.

నేను ఈ చేతుల్తో పెంచి పెద్దచేసిన వరుణ్, నా కాళ్ళ మీద వేసుకుని రుద్ది రుద్ది స్నానం చేయించిన వరుణ్, ఇంజనీరింగ్ చదువుతూ విద్యతోపాటు విచక్షణ కూడా నేర్చిన వరుణ్ తర్జని చూపించి నన్ను బెదిరిస్తున్నాడు. కారణమేదయినా సరే .

నేను తేరుకునేలోపుగానే తనతోటి వచ్చిన కుర్రాళ్ళతో హీరో స్టయిల్లోనే బూట్లు టకటకలాడించుకుంటూ నడుచుకుంటూ వెళ్ళాడు. వెళ్తూ వెళ్తూ వాళ్ళు ముంగిట్లో వున్న మొక్కలన్నింటినీ ఎడాపెడా తొక్కుకుంటూ, కత్తితో నరికి చిందరవందరగా పడేసి వెళ్ళిపోయారు.

"ఏంటి పెద్దమ్మా? ఈ మొక్కనాటి నాలుగు రోజులయిపోయింది... యింకా ఒక్క ఆకు కూడా రాలేదేంటి?... అబ్బ ఎన్ని రోజులు పెద్దమ్మా పూలు పూయడానికి?" అంటూ తెగ వేధించే వరుణ్ నా కళ్ళముందు నిలిచాడు. ఆ వరుణేనా యిప్పుడు బాగా ఎదిగి వున్న మొక్కల్నీ, పూలు పూసే కొమ్మల్నీ నిర్దాక్షిణ్యంగా నరికివెళ్ళాడు.

పెదనాన్న గుండెల మీద తప్ప, కింద పడుకోడానికి ఏమాత్రం యిష్టపడని వరుణ్... మీ ఆయన, మీ ఆయన అంటూ పెదతండ్రిని గుండెల్లో నుండి పెకలించి పారేశాడు.

భూమ్మీద నుండి మట్టి దుమారంలా లేచి ఆకాశాన్ని కప్పేస్తోంది.

✦ ✦ ✦

ఈ వూరు అటు పెద్దదీ, ఇటు చిన్నదీ కాదు. పక్కవాళ్ళు ఆపదలో వుంటే ఆదుకోరు... అలాగని అన్నీ పట్టించుకోకుండానూ వుండరు. డిగ్రీలు చదివిన పిల్లల్ని ఆ పల్లెటూర్లో యిస్తున్నావేంటి? అంటూ అమ్మని అంతా దెప్పిపొడిచారు. మేనరికాల మీద నాకే మాత్రం ఆసక్తి లేకపోయినా మగదిక్కులేని అమ్మ అసహాయస్థితిని చూసి అప్పట్లో తలవంచాల్సి వచ్చింది. అయితే పెళ్ళయిం తరువాత అసహనాన్ని అభిమానం గానూ, అసంతృప్తిని ప్రేమగానూ మార్చుకుని కుటుంబంతో రాజీపడిపోయాను.

ఎంతో ఆనందంగా, సాఫీగా వున్న కుటుంబంలో నాలుగేళ్ళనాడు రేగిన రవరవలు మెల్లిగా రాజుకుని, రాజుకుని మనుషులు దూరమై, కుటుంబాలు రెండై, మనుషులు ఛిద్రమై...

ఇప్పుడు ఎవరు ఎవరిమీద కేసు పెడతారు? ఎవరు ఎవర్ని బొక్కలో దోయిస్తారు? ఎందుకింత అర్థం లేకుండా ప్రవర్తిస్తున్నారు?

ఎస్.ఐ.గారు జరిగిన విషయాన్ని గురించి ఎంక్వయిరీ చేయడానికంటూ నా వద్దకొచ్చినప్పుడు... గేటు వేయడం మర్చిపోవడంతో పశువులొచ్చి మొక్కలన్నింటినీ ధ్వంసం చేసిపోయాయి. అంతకంటే యిక్కడేమీ జరగలేదు అంటూ కచ్చితంగా చెప్పాన్నేను. ఎస్.ఐ. మా ఆయన వంక చూసి వ్యంగ్యంగా నవ్వుతూ వెళ్ళిపోయాడు. ఆ అవమానాన్ని తట్టుకోవడం అతి కష్టమైపోయిందీయనకి.

నా మీద అలిగి ఆరోజు నుండీ పొలం దగ్గరే వుంటున్నారు. నా పద్దెనిమిదేళ్ళ సాంసారిక జీవితంలో... ఎన్నెన్ని పనులున్నప్పుడయినా, చనగ పెరుకుడప్పుడూ, పైరు కోతలప్పుడూ, నూర్పిళ్ళప్పుడూ కూడా యింటికి రాకుండా అక్కడే వుండిపోలేదు.

ఎక్కడో ఏదో కదిలినట్లుగా వుంది. ఎవరో కొన్ని వందల చేతుల్తో నా మనసుని కలిబెడ్తున్నట్లుగా వుంది. ఎంబ్రాయిడరీ చేస్తూ చిక్కుబడిన దారాన్ని సమానంగా, ఓపిగ్గా ముడులు విప్పగలను... కానీ జీవరసం లోపించి చిక్కుబడిపోతున్న బంధాల్ని విప్పడంలో నేనెప్పుడూ ఓడిపోతూనే వున్నాను.

పైరగాలి కలగాపులంగా పరిమళాలు నింపుకుని రివ్వున వీస్తోంది శూన్యంవైపు. అలవాటు లేకపోవడంతో అది నా ముక్కుల్ని కదిలించింది. ఎగబీలుస్తూ ముందుకడుగేశాను. గనిమె మీద గడ్డిపరకల్లో దాక్కున్న ముల్లు నా కోసమే కాటుక్కూచున్నట్లుగా పాదాల్లోకి దిగిపోయింది. గూట్లో వదిలొచ్చిన పిల్లలకోసం ఆవురావురుమంటూ పక్షులు తిరిగి వెళ్తున్నాయి, నేను మా ఆయన కోసం వెదుక్కుంటూ వచ్చినట్లుగా...

తోకలు పైకెత్తి ఆలమందలు పరుగు మీద యింటి ముఖం పడ్తున్నాయి. దాంతో పైకి లేచిన గోధూళి సంజె వెలుగుతో కలిసి కుంకుమ రంగులో మెరుస్తోంది.

ఆ చిన్న వాటర్‌షెడ్లో ఎవరో తెచ్చి వేసిన కుక్కి మంచం మీద చేతిని దిండుగా మార్చి నిద్రపోతోన్న రఘుని చూస్తుంటే జాలేసింది. లేపాలన్పించక షెడ్డుకి ఆవలివైపుగా వున్న కొబ్బరితోటలోకి నడిచాను మెల్లిగా... ఎంతో పెద్దపెద్ద సంఘటనల్లో సీరియస్ విషయాల్ని కూడా అతి తేలిగ్గా తీసుకుని నవ్వేసే రఘు యింత చిన్న విషయాన్ని ఎందుకింత డీప్‌గా థింక్‌చేసి తమ్ముడు బోసుబాబు కుంటుంబం మీద కక్ష పెంచుకుంటున్నాడో అర్థం కాకుండా వుంది... ప్చ్...

సాయంసంధ్యలో కొబ్బరితోటలోకి నడుస్తుంటే మేఘాల్ని పలకరించి రావడానికి ఆకాశంలోకి ఎగిరినట్లుగా వుంది నాకు.

"నీకేం తెలీదు నువ్వు గమ్మునుండు నాయినా... ఇట్ల తిక్కలోడివి కాబట్టే నిన్నాడుకున్నారు రెడ్లు ..." తీవ్రంగా వున్న ఆ గొంతు జయరాముడిదిలావుంది. టెన్త్ దాకా చదువుకున్న జయరాముడు బోసుబాబు వద్ద వుంటూ, అటు వ్యవసాయం పనులూ, ఇటు కాంట్రాక్టు పనులూ రెండూ చూసుకుంటుంటాడు. అన్న దగ్గర వెంకట్రా ముడూ, తమ్ముడి వద్ద జయరాముడూ .

ఇద్దరూ కొబ్బరిచెట్ల చాటున కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఇద్దరి నడుమా నలుగుతోన్న సంగతేమిటో అర్థంకాక అప్రయత్నంగా అడుగులాపి నిల్చుండిపోయాను, నా రాకని వారు గమనించకముందే.

"నువ్వేమయినా చెప్పబయా... పాపం రఘురెడ్డిని చూస్తుంటే నాకు నిండా బాధగా వుండాది... మూడు దినాల్నుండీ యింటిక్కాడ పోకుండా, తిండీతిప్పలూ లేకుండా పడివుండాడు," వెంకట్రాముడి గొంతు జాలితో వొణికింది.

"నాయినా..." అర్థని చూపిస్తూ, "మాట్లాడబాకు, కిష్టారెడ్డి హయాంలో నువ్వు పడిన బాధలన్నీ నాకు తెలీవనుకోబాకు... అట్టాటి కర్మడికి పుట్టినందుకు ఈ రెడ్లు మంచోళ్ళయినా, చెడ్డోళ్ళయినా సరే పడాల్సిందే... అయినా బోసుబాబేమైనా తక్కవోడను కుంటుండావా? అందితే ఆకాశాన్నయినా సరే మింగేస్తాడు... అందుకే గదా అక్కడ్నుండే మొదలుపెట్టింది నిప్పురవ్వలేయడం..." వికటంగా నవ్వుతున్నాడు జయరాముడు.

"నిజమేన్రా... అదంతా ఒక కాలం. కిష్టారెడ్డి రావణాసురుడా? ఊరికి యముడే గదా... నువ్వు నమ్ముతావో లేదోగానీ ఆరోజుల్లోనే కొత్తగా రైలుబండొచ్చింది మనూరికి. ఈ మనిషి ప్రయాణమై వొస్తుండాడంటే చాలు రైలుబండయినా సరే నిల్చిపోవల్సిందే.

"మన వాడవాడంతా కిష్టారెడ్డి కూర్చోమంటే కూర్చోవాల, నిల్చోమంటే నిల్చోవాల. కోతల టయిమప్పుడయితే ముందు కిష్టారెడ్డి చేనుకోసి అవతల యేరేవాళ్ళకి బోవాల్సిందే. ఆ యయ్య డబ్బులిస్తే తీసుకోవాల... లేదంటేలేదు... అబ్బో భలే యేలినాడులే ఈ భూమ్మీద... అట్టాటి మనిషి ఈ ప్రెపంచకంలోనే ఎవురూ వుండరనుకోయేమే..."

చేదు జ్ఞాపకాల్ని నెమరు వేసుకోవడానికి ఏమాత్రం యిష్టం లేనివాడిలా అతి కష్టం మీద చెప్పుకుపోతున్నాడు వెంకట్రాముడు.

"నా కందుకు తెలవదు నాయినా? ఆ కిష్టారెడ్డి పిలుస్తుండాడంటే నిద్రలో కూడా వొణుకుతూ పరిగెత్తేదిగదా నువ్వు... ఆ పేరు వింటేనే చాలు మనోళ్ళంతా వొంగి వొంగి దణ్ణాలు పెట్టేది... అబ్బా చిన్నబాధలా అయ్యి... అందుకే చెప్తుండాను, వాడి వంశమీ భూమ్మీద నిలవగూడదు," శపిస్తున్నట్లుగా అన్నాడు జయరాముడు.

"మనకెందుకబయ్యా" అంతా ఆ దేవుడే చూసుకుంటాడు.

"హయ్యో పిచ్చినాయనా దేవుడే వుంటే కొంతమందినిట్టా, కొంతమందినట్టా ఎందుకు పుట్టిస్తాడుచెప్పు? నీ దేవుడ్ని నేను నమ్మనుగానీ నిజం చెప్పు... అమ్మ చచ్చి

పోయింది ఆ కిష్టారెడ్డి వల్లగాదా? దాన్ని నేను మర్చిపోగల్తానా? అన్నింట్లో మాత్రం అంటు ముండానాయాళ్ళకి. మనల్ని తాకరు... ముట్టుకోరు... మనం తాగిన నీళ్ళు తాకరు... మనం వాళ్ళిళ్ళల్లోకి రాగూడదు... మనాడోళ్ళు మాత్రం వాళ్ళ పక్కల్లోకి రావాలి. దానికి మాత్రం అంటుండదు దొంగనా బట్టలకి," కసిగా వుంది జయరాముడి గొంతు.

భార్య జ్ఞాపకాలతో కాబోలు వెంకట్రాముడు బాధగా తలొంచుకున్నాడు... జయరాముడు మాత్రం మాట్లాడ్డం ఆపలేదు.

"అంతెందుకు నాయినా... వాడు తుమ్మితే పడమటి కయ్యిల్లో పక్షులెగిరి పోయాయని నువ్వు నవ్వినందుకు మూడునెల్లు నీకు ఉప్పు లేకుండా అంబలి పొయ్యి లా. వాడి కింద చాకిరీ చేసినందుకు నీ చావు నువ్వు జస్తివి గద నాయినా... నాడొక మనిషా? అందుకే యిప్పుడు వాళ్ళుప్పు వాళ్ళ చేతే తిన్పిస్తుండా."

ఒక పదునైన కత్తి, ఒక లైంగిక హింస, ఒక హింసాత్మకమైన జీవితమేదో ఏళ్ళ తరబడి వెంటాడుతున్న వాడిలా కక్షగా వుంది వాడి మొహం. రెట్టిస్తున్నట్లుగా ఒకదాని వెంట మరొకటి ఎన్నెన్నో సంఘటనలు వైనవైనాలుగా చెప్పి వెంకట్రాముడ్ని నిలదీస్తు న్నాడు జయరాముడు. వెంకట్రాముడి చీకటి జీవితంలో వెలుతురు చుక్క పుట్టినట్లుగా వున్నాడు వాడు.

"అట్టపోనీలేరా... ఎప్పటి మాట? వాళ్ళనే పెద్దోళ్ళుగా వుండనీ. మనమే చిన్నోళ్ళుగా వుంటాం..." తాత ముత్తాతల నాటి వెంకట్రాముడి వారసత్వం వాడిచేత అట్లా మాట్లాడించి వుండొచ్చు.

జయరాముడు తండ్రి కేసి యేవగింపుగా చూసి,

"త్పూనీయవ్వ... అట్నే చిన్నోడుగానే వుండులే... ఛీ" అని ఉమ్మేసి పైగుడ్డ విదిలిస్తూ పైకి లేచాడు..." నేను పోయి రంగసామితో చెప్పేసొస్తా రేపు రాత్రికి రమ్మని అప్పుడు చూడు తమాషా యింకా ఎట్టుంటాదో" తోటకి తూర్పున వున్న ముళ్ళకంచెని దాటుకుని బోసుబాబు పొలంలోకి వెళ్ళిపోయాడు జయరాముడు... ఆ మునిమాపువేళ వాడలా నడిచి పెళ్తుంటే ఇంద్రజాలమాంత్రికుడెవరో అడుగులు వేసుకుంటూ వెళ్తున్న ట్లుగా వుంది. ఉన్నట్టుండి నా తలలో నుండి ఏవో మంటలు లేచినట్టయింది... మా యింట్లోని మొత్తం విధ్వంసానికి కారణం జయరాముడన్న దానికన్నా... నేనెన్నడూ చూడని మా మామగారి నిరంకుశత్వం... జయరాముడు కూడా కిష్టారెడ్డి కొడుకన్న నిజం జ్వాలై నా మెదడును మండిస్తోంది...

*ప్రజాశక్తి ఆదివారం*
*4 మార్చి 2001*